పత్రికాప్రకటన                                                                                              తొండంగి, జూన్ 6, 2018.

## మానవ వనరుల సద్వినియాగం కోసమే నూతన యువజన విధానం

## 1400 కోట్ల తో విశాఖపట్నం-కాకినాడ బీచ్ రోడ్

## ప్రభుత్వ ఆదాయంలో సింహ భాగం సంక్షేమానిదే.

–నవ నిర్మాణ దీక్షలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు

రాష్ట్రంలో మానవ వనరులు సద్వినియోగం చేయడం మరియు నిరుద్యోగ యువతుకుచేయూత నందించడానికి నూతన యవజన విధానాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. నవ నిర్మాణ దీక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు తొండంగి మండల ఎంపిడిఓ కార్యాలయం వద్ద జ్ఞానభూమి, ఉపాధి కల్పన అనే అంశంపై జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల మంది నిరుద్యోగ యువతకు నెలకు రూ. 1000/- చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ పథకం ద్వారా నిరుద్యోగ భృతి పొందే యువత స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవలసిన అవసరం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని యువతీ, యువకుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజల నుండి వచ్చిన వివిధ విజ్ఞప్తులనుసరించి నూతన పథకాలు రూపొందిస్తున్నామని వీటిలో భాగంగా చంద్రన్న భీమా, పెళ్లి కానుక వంటి పథకాలు రూపొందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగుల జీతభత్యాలు, ఎస్టాబ్లిష్మెంట్ చార్జీలు పోగా మిగిలిన ఆదాయానంతటినీ సంక్షేమ పథకాలన్నీ వినియోగిస్తున్నామన్నారు . రాష్ట్రంలో 70 వేల కోట్లు సంక్షేమానికి వినియోగిస్తూ సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్రం దేశంలో ప్రధమ స్థానంలో ఉందన్నారు. పింఛన్ల పంపిణీ కోసం 50 లక్షల మందికి ప్రతీ నెలా పింఛన్లు పంపిణీ కోసం 7 నుండి 8 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని రాష్ట్రంలో మరో 3.5 లక్షల పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పింఛన్లను అర్హులైన వారందరికి త్వరలో అందజేస్తామన్నారు. అదే విధంగా అనాథలైన ఒంటరి మహిళలకు కూడా పింఛన్ ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు . అవసరమైతే అప్పు చేసి కూడా పథకాలు అమలు పరుస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి లక్షా 81 వేల కోట్లు అప్పులున్నాయన్నాయని,ఈ సంవత్సరం పథకాల అమలుకు మరో 23 వేల కోట్లు అప్పులు తీసుకున్నామన్నారు. తొండంగి మండలంలోని కోనప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని , ఈ ప్రాతంలో భవిష్యత్తులో ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. విశాఖపట్నం- కాకినాడ నాలుగు లేన్ల బీచ్రోడ్డు నిర్మాణానికి ఎడిబి నిధులు 1400 కోట్లు మంజూరయ్యాయని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ నవ నిర్మాణ దీక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ రోజు ఒక అంశం పై చర్చలు నిర్వహించి దానిపై అభిప్రాయాన్ని సేకరించి,ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కోస్తాతీర ప్రాంతంలోని మత్స్యకారులు, షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు కలక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో చంద్రన్న పెళ్ళి కానుక ద్వారా లబ్దిపొందిన జంటలను మంత్రి యనమల, కలక్టర్ కార్తికేయ మిశ్రా ఆశీర్వదించారు. మండలంలోని స్వయం శక్తి సంఘాలకు 3.20 కోట్ల బ్యాంకు లింకేజి, 42 లక్షల స్త్రీ నిధుల చెక్కుల రూపంలో లబ్దిదారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంమలో తుని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ యనమల కృష్ణుడు, ఆర్డిఓ వి.విశ్వేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శోభారాణి, డిఇఓ ఎస్.అబ్రహం, యంపిపి చిట్టుమూరి సంధ్య రాజశేఖర్, జడ్పిటిసి చక్కా పెద్ద సత్యవతి, మండల అభివృద్ధి అధికారి బిహెచ్ఎస్ఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )